# కొడవలందుకుంది

''ధన్'' మని తుపాకి పేలిన చప్పుడు.

''టప్'' న వేపచెట్టు మీది కొంగ నేల పడింది.

''అరె జలాల్ దాన్ని హలాల్ చేసి, జలావరె'' తుపాకిని కిందికి దించుతూ అన్నాడు గాలీబు. తెలగాణాలోని జాతీయ రహదారి పక్కన కిలోమీటర్ లోపల ఓ జాగీరు గ్రామం, దాని చుట్టుపట్ల

నిజాం తాబేదారుల ఏలుబడి. వాళ్లు ఆడింది ఆట పాడింది పాట.

గాలీబు ఆ ఊళ్లో గళ్ల లుంగి, తెల్ల చొక్కాతో తిరుగుతూ గరీబులను సతాయిస్తూ, ఆమీరులకు సలాం కొడుతూ ఉంటాడు. కనుక గాలీబు కళ్లు ఎప్పుడు ఎరుపెక్కి వుంటాయి. సర్కారు వాళ్లకు సహకారిగవుంటు, ఊళ్లో కర్ర పెత్తనం చెలాయిస్తూ, దేవర దున్నలాగ తిరుగుతు వుంటాడు.

జలాల్ ఆ పుల్ల ఈపుల్ల ఒక్క దగ్గరేసి మంట చేసి ఈకలు, తోకలు పీకిన పక్షిని మంటల్లో మాడ్చుతూ వున్నాడు. ఎండుపుల్లల మంట అప్పుడప్పుడు ఎత్తుగా మండి, కొసమంటలు అతని పొడుగాటి గడ్డం కొసలను అంటుకోగ నాలిక కరుచుకొని కాలిన వెంట్రుకలను చేయితో రుద్దుకుంటు వెనక్కు జరిగి కూర్చున్నాడు. జలాల్‌గాలీబుకు జీత- భత్తెం లేని బంటు. వానికి పూట గడవాలి వీనికి వెంట వాడు వుండాలి.

పక్కనే వున్న తాటి చెట్టు మీద నుండి కల్లు కడవను దించుకొస్తున్న గౌండ్ల యాదయ్య తుపాకి చప్పుడు వినగానే, ఇగ ఈ పటువా యింతె సంగతులు, అనుకొని మౌనంగా దిగుతున్నా ఆయన ముస్తాదుకున్న మువ్వల చప్పుడు, మోకు చప్పుడు గాలీబు నోట్లో నీరు ఊరించాయి.

''అరె యాదిగ జల్దిరా''

యాదయ్య తాడు దిగి, మోకును కుడి భుజం మీద వేసుకుంటు తాటి మొదట తాను తెచ్చిన కల్లును కొంచెం వొంచి, గాలీబు ముందుకొచ్చి కాలితో నేలను కాస్త గుంట చేసి అందులో కల్లు పటవను ఉంచాడు. లేని నవ్వును తెచ్చుకొని నడుముకున్న కొడవలిని చేతిలోకి తీసుకొని అరచేతిలో దానిని అటు ఇటు కదిలించి, వేలితో పదునును చూస్తూ నిలుచున్నాడు.

''ఏంది బే నర్కేస్తా అన్నట్లు నిలబడ్డవు. కమ్మను కొట్టు రేకలు కట్టు.''

ఆ రోజు కోసమే ఎదురుచూస్తున్న యింకెంత దూరమో లేదు దగ్గర

కొస్తుంది. నీవు చేసే పాపపు పనులకు ఎవడో ఒకడు నీకోసం పుట్టే వుంటడ్ర నా కొడుక అని మనస్సులో అనుకుంటు వుండగా,

''అరె నడువుర, పొద్దెక్కుతుంది, కనిపిస్తలే, గొంతెండి పోతుందిర''

యాదయ్య యిగ తప్పదని, పక్కనే వున్న బొత్తవైపు నడిచాడు.

''అరె జలాల జలాయరే, ఓర్యాకల సెట్టుకరా'' అంటూ అదె చెట్టుకింద వున్న ఓ చిన్న గుండు మీద కూర్చున్నాడు. ఈ లోపల రేకలు కట్టుకొచ్చాడు యాదయ్య. ఓ రేకలో కాల్చిన పక్షిమాంసాన్ని పెట్టిగాలీబు ముందుంచాడు. యాదయ్య పటువలోని కల్లును ముంతలో పోసుకొచ్చి, గాలీబు రేకలో వంచుతున్నాడు. గాలీబు కల్లు తాగుతు మధ్య మధ్య మాట్లాడుతు వున్నాడు.

''అరె యాదిగ, చెట్టు కల్లు - పిట్ట మాంసం, మజాగుందిర'' అంటూ నవ్వుతుంటే యాదయ్య శరీరం మీద పాములు పారినట్టు అనిపిస్తువుందేమో అసహనంగ చుట్టు చూస్తు వున్నాడు.

''పిట్ట మాంసాన్ని పళ్ల మధ్యన పట్టి వుంచి, ఎముకను వేరు చేసి పారేసేవాడు గాలీబు.''

''పెట్టగూడ వుంటవే'' కల్లు తాగి ఖాళీ రేకను పక్కన పెడుతూ అన్నాడు జలాల్. అప్పుడు అతని మీసాలు లేని పెదవికి అంటిన కల్లు నురుగును నోట్లోకి పీల్చుకున్నాడు.

''వాటికి ఏంకరువు'' అంటూ విలాసంగా నవ్వినప్పుడు, రోజు ఆకు నమిలే నోరు కనుక మాడిన పిట్ట ఎముకల లాగే అతని పళ్ళూ కనబడ్డాయి.

ఆ మాట వినగానే యాదయ్యకు గుండెను పిండినట్లయి ఈ రోజు ఏ కొంపకు నిప్పుపెడతాడో అనుకుంటూ ''దొర యింకా చెట్లు గీసేదివుంది మీరు వొంచుకొండ్రి'' అంటూ పటువలోని కల్లు లొట్టిలో

పోసి అక్కడి నుండి కదిలాడు.

''అరె యాదిగ, మీ గౌండ్లల్లందర్కి చెప్పు, రేపు పీర్లు బాయిల పడతయి''.

''ఈయాల బాగ దూలాడాలే, తలా ఓ కుండ గట్టి కల్లుంటే, అట్లనే చెట్టుమీదిది పంపమని చెప్పు. తెచ్చి, పీర్ల కొట్టం ఎన్క పెట్టమను. ఈయాల్ల అందర్కి నా తర్పున దావత్. రాత్రికి అందరు బాగా దూలాడాలే అంతే జావ్'' అంటూ లేని మీసాన్ని మెలివేసుకున్నాడు.

''బస్ అంతే'' జలాల్ వంత పాట.

ఆ పూటంతా బాగా తాగిన గాలీబ్, జలాల్ ఇద్దరు సోలుతూ ఊరివైపు నడిచారు.

యాదయ్య మరో తాడును సగం వరకు ఎక్కి కాలితో తాడును తొక్కిపట్టి, వెనుక ముస్తాదులోని గీత కత్తిని తీసి నెర్పు చెక్కమీద నూరుకుంటు, ఊరివైపు వెళుతున్న గాలీబ్ వైపు చూస్తు పండ్లు పట పట కొరికాడు. వాడు ఊళ్లో సాగిస్తూ ఉన్న ముదనష్టపు-చేతలు గుర్తు రాసాగినయి.

వాడు ఎప్పుడు తాటి వనంలో తిరుగుతూ గొంతు వరకు కల్లు తాగి, కట్టె పుల్లలకు పీడకలకు వొచ్చిన ఆడవాళ్లను అటకాయించి, చెట్లు చాటున - చేను చాటున బలవంతంగా అనుభవిస్తూ వుంటాడు. ''ఏడిచినా, ఏవరికైన చెప్పుకున్న మీ మొగలను చంపేసి, బతికినంతకాలం మిమ్ములను వెంటాడుతూనే వుంట'' అంటు బెదిరిస్తూ వుంటాడు.

••••

ఒకరోజు తాను తాటి మీదున్నాడు. ఆముదపు కాయను బండిలో నింపుకుని ఊళ్లోకి పోతు ఓ కాపు, తన భార్యను సేను కాపల వుంచి

వెళ్లాడు. సేను మధ్యన ఉన్న మోదుగు సెట్టు ఎక్కి రేపటి హోళీ పండుగ కోసం పూలు తెంపుతువుంది. అక్కడికి కొంత దూరాన వున్న బాటన వెళుతున్న గాలీబు చూపు ఆమె మీద పడగానే, ఆగి చుట్టూ చూసి, ఒక వుదుటున తోడేలు మేక మీద పడ్డట్టు పడ్డాడు. పెద్దగ మొత్తుకుంది. నోట్లో కొంగును కుక్కాడు. ఆముదం ఆకులు గల గల మన్నాయి. వెక్కి వెక్కి ఏడుస్తు కూర్చుంది.

గుడిసెలోని కుండల వున్న కూడు తిని పరుగెత్తె ఊరకుక్కలా వాడు పెద్ద పెద్ద అంగలతో సేను దాటి ఊరి బాటన పడ్డాడు. ఆ రాత్రి ఆమె భర్తతో ఏం చెప్పిందో ఏమో అతను నాదగ్గర్కి కొచ్చి బాధగా నిట్టూర్చాడు. నా నోట మాట రాలేదు. ఇద్దరి కళ్ళల్లో కన్నీళ్ళు వూరి మల్లి యింకినయి.

''నీ ముస్తాదులో ముంజలు నరికే కొడవలి లేదా'' అని అడిగాడు.

''వున్నది'' అన్నాను.

''విసిరితే బాగుండేది'' అన్నాడు.

గురి తప్పితే అన్నాను.

''ఆ కొడవలి యిక్కడియి'' అని మాసూరున వున్న ముస్తాదులోని కొడవలిని అందుకొని పోయిండు.''

ఊరు నిద్ర పోయే వేళ్ళ. చిమ్మచీకటి.

ఆడు దుర్మార్గుడు. అన్ని ఎదురుకో గలడా. ఆల్లది రాజ్యం, ఆల్లు ఏది చేసిన చెల్లుతుంది.

రాత్రంతా నిద్ర పట్టలేదు. తెల్లవారే సరికి ఊరంతా గందర గోళంగా వుంది. గాలీబు ఆకిట్లో రక్తం మరకలు నల్లగ కనిపిస్తున్నయి.

రచ్చబండ దగ్గర మొండెం, తలను ఎక్కడ వేశాడో తెలియదు. కాపు

భార్య మొండెం మీద పడి ఏడుస్తువుంది. ఊరు ఊరంత అక్కడే చేరి ఏడుస్తూ వున్నారు.

''ఆఖరుసారి మొఖమున్న సూసుకుంటం తలనెక్కడ ఏసింగ్రో సెప్పంగ్రి.'' అంటూ కాళ్ల వేళ్ల పడ్డా తలను యివ్వలేదు గదా ఎక్కడేసింది గూడ చెప్పలేదు. ఊరి కరణపోడు అయితేనేం, ఊరి పటేండ్లు అయితేనేం ఎవ్వరు ఎదిరించలేదు సర్కారోడు ఆ నోడేనాయె.

కత్తి నూరడం ఆపి, ఓ సారి వేలితో పదును తాకి చూసి, కత్తిని ముస్తాదులో పెట్టుకొని, మోకును పైకి జరుపుకొని చెట్టును ఎక్కసాగాడు యాదయ్య. అతని రాకను చూసి అంతవరకు లొట్టి మీద వాలిన చిలుకలు రెండు రెప రెప మంటు ఎగిరి పోయినయి.

••••

సూర్యుడు నెత్తిమీదున్న వేళ.

పీర్ల కొట్టం ముందు జనం గుంపులు గుంపులుగా నిలుచొని రేపు పీర్లు బావిలో పడే విషయాన్ని చర్చించుకుంటున్నారు.

ఆడవాళ్లు కొందరు వాళ్ల వాళ్ల పిల్లలు పూల దండలను, సజ్జాకు దండలను కొబ్బరి కుడకలను పీర్ల ముందు వుంచుతూ చేతులు జోడిస్తున్నారు. ముజావరి నిప్పులపై వూదు చల్లుతు, పొగను పీర్ల ముందు తిప్పుతు, ఆ తరువాత అక్కడున్న వాళ్ల కణతలకు ఊదాన లోని బూడిదను తీసి వేళ్లతో అంటిస్తూ వుంటే, అందరు భక్తితో తమ వద్ద వున్న నాణాలను తాంబాళంలో వేస్తూ వున్నారు. సాయంత్రం వరకు ఆ అర్చన సాగుతూనే వుంది. పొద్దుకూకింది. రేపే పీర్ల పండుగ కనుక ఆలావ నిండా మొద్దులను నింపి పట్టుకొని ఒక్కొక్కరు పీర్ల కొట్టం వెనుకకు వెళ్లి కల్లు తాగి వొస్తువున్నారు.

''ఈయాల్ల గాలీబ్ సాబు దూలాడుతడట'' ఒకరు.

''అట్టనా'' మరొకరు.

''ఆని మొకానికి యింకా అదొకటా'' అంది అప్పుడే అక్కడికి వొచ్చి నిలుచున్న ఓ నడి వయస్సు స్త్రీ. ఆమె అనడంలో ఓ ఈసడింపు ఉంది.

''అతడు ఆడతడు, దూలాడతడు అడడు మరి'' అన్నాడు ఓ వృద్ధుడు నర్మగర్భంగా.

చీకటి ముసిరింది. ఒకరి తరువాత ఒకరు వొస్తూనే వున్నారు. తమతో పాటు తెచ్చుకున్న దూల కర్రలను తిప్పుతు అలవా చుట్టూ తిరుగుతూనే వున్నారు. దూల కర్ర అంటే సీతాఫల కర్రకు మొదటి భాగాన ఓ పిడికిలి వెడల్పు తోలుంచి, ఆ తరువాత ఓ ఇంచ్ తోలు వొలిచి, దాని తరువాత మరో యించ్ తోలు వుంచి, ఆ తర్వాత యించ్ వొలిచి, అలా పూర్తి కర్రను కాట్లు కాట్లుగ సిద్ధంచేసి, దానిని నిప్పులో మాడ్చుగ వొలిచిన చోట తెల్లగ, తోలును వొలచని చోట నల్లగా వుండేదే దూలకర్ర.

అప్పటి వరకు కాపిన డప్పులను దరువువేసి చూసుకుంటున్నారు డప్పులవాళ్లు.

గాలీబ్ చెప్పినట్లు ఈ రోజు చాలా మంది యువకులు వచ్చారు. అందరు బాగా తాగి ఉత్సాహంగా వున్నారు.

అక్కడవున్న మిగతా జనంలో ఏదో గుసగుస, ఆడ - మగ అందరు మూగ భాషలో చర్చలు, సరసం లేని సైగలు. దగాపడ్డ గుండెల్లో ధైర్యం నిండుకుంటువుంది.

ఒక్కసారే డప్పుల మోత మొదలైంది. అందరు హల్వా చుట్టు చేరుతువున్నారు. డప్పుల మోత ఎక్కువైంది. జనమూ ఎక్కువయ్యారు. తెల్లని కుర్త, గళ్ల లుంగీని బిగించి కట్టుకొని, చేతిలో దూలకర్రను

పట్టుకొని గాలీబ్ ఆల్వావైపు వస్తూ, వస్తూ పీర్లవైపు మళ్లీ చేతులు జోడించి భక్తితో దండం పెట్టి చుట్టూ చూశాడు. జనం బాగా వచ్చింది గ్రహించి చిరునవ్వులు చిందిస్తూ హల్వా వైపు వస్తున్నపుడు, జనం పక్కకు జరుగుతు తోవ యిస్తూ వున్నారు. గాలీబ్ దులా కర్రను భుజాల మీద పెట్టుకొని అడుగులను విశాలంగా వేస్తు నడుస్తున్నప్పుడు జనంలో కొందరు కోపంగానూ, మరికొందరు ఈసడింపుగాను చూస్తున్నారు. అతని మెడలో నల్లని దారానికి తెల్లని వెండి తాయత్తు మంటల వెలుతురులో మెరుస్తు వుంది. గాలీబు రావటం చూసిన డప్పుల వాళ్లు తమ సత్తాను చూపిస్తూ వాయిస్తున్నారు. అక్కడున్నవాళ్ల శరీరాల్లో ఏదో ఉత్సాహం గంతులేస్తున్నట్లు, వాళ్ల చూపుల్లో, కదలికల్లో అక్కడి మంటల వెలుతురులో కనిపిస్తూ వుంది.

ఎక్కడినుండో ఆడవాళ్లు ధరించే తెల్లని వెండి గోట్లు నిప్పుల్లోకి విసరబడ్డాయి! అవి ఎవరు ఎందుకు విసిరారో ఎవ్వరు పట్టించుకోలేదు.

డప్పుల మోతల్లో దర్పు పెరుగుతూ ఉంది.

హల్వా చుట్టు జనం పెరుగుతూ వున్నారు. దూల ఆటలో ఓ ఊపు అందుకుంది.

డప్పుల మోత పెరుగుతు వుంది.

ఊరు వూరంత ఆడ - మగ అందరు పీర్ల కొట్టం ముందు నిలుచొని దూల ఆటను చూస్తు ఉన్నారు.

గాలీబ్ వల్లెరగని ఆట ఆడుతున్నాడు. తిప్పెకర్రగాలిలో గాలై, వెలుగులో వెలుగై తిరుగుతోంది. ఆ కర్ర తిప్పే చేతులే కదా! ఎన్నో నోళ్లను నొక్కి పట్టినయి. దూలాల లాంటి పిక్కలున్న గాలీబు వేసే అంగలకు ఆల్వా చుట్టు దుమ్ము లేస్తూ వుంది. ఆ పిక్కలే కదా ఎన్నో కాళ్లు - చేతులను

నొక్కి పట్టినయి. ఎన్నో జతల కళ్లు ఆ పిక్కలను కాపల వున్నాయి. వున్నట్టుండి కళ్లు కళ్లు సైగలు చేసుకున్నాయి. అంతే, డప్పుల దరువు మారి ప్రేతాళ్ల మోతగా మారింది. పీర్ల కొట్టం ముందు కాచుకొని కూర్చున్న కొమ్ము వాడు మొదటిసారి కొమ్ము వూదాడు. ఆట జోరు పెరిగింది. ఎవరో ఆలావలో మొద్దులను కదిలించగా మంట పెరిగి నిప్పు రవ్వలు లేచాయి. కొమ్మువాడు రెండవసారి కొమ్ము ఊదాడు. జనంలో ఓ ఉద్వేగం పెరిగింది. ఆడుతున్న పిక్కలను కూర్చున్న చేతులు బలంగా వెనక్కు గుంజాయి!

ఆలవాలో బోర్లపడి పోయిన మనిషి! మంటల్లో మనిషి కాలుతున్న కమురు వాసన చుట్టూర కమ్ముకుంది. జనం ఎవరిదారిన వారే ఉరుకులు - పరుగులు - క్షణంలో పీర్లకొట్టం ముందు ఒక్కరు లేరు. పీర్లు పీర్లలాగే నిలబడివున్నాయి!

అర్ధరాత్రి పోలీసులొచ్చి అనుమానం వచ్చిన వాళ్లను కొట్టి నానా హింసలు పెట్టారు. ఊరు చుట్టూర పోలీసు కాపల. ఊరంతా మూగపోయింది.

''ఎవరు చేశారీపని?'' ఊరి పెద్దల ప్రశ్న.

''ఎవరు చంపారు?'' పోలీసుల గద్దింపు.

మరునాటి పొద్దున పంచనామా జరుగుతూ వుంది.

ఊళ్లోని సాహెబులందరు తల్వారులను ధరించి ఆందోళనగ అటు యిటు తిరుగుతు -

''ఈ రోజు ఈయన రేపు మరొకరు'' అంటూ కయ్యానికి కాలు దువ్వుతున్నారు.

''యిన్నేండ్లు అందరం కల్సియే బతికాము. యిగ ముందు కలిసియే

బతుకుతాం'' నాలుగు కాలాలు చూసిన ఓ వృద్ధుని మాట. బోసి నోరు, తలపాగా, దుడ్డు కర్రను ఆసరాగ పెట్టుకొని నిలుచున్నాడు. అర్ధనగ్నంగా వున్న అతని ఎద మీద వెంట్రుకలు తెల్లగ పండినయి.

''అరె బతుకుతం - బతుకుతం, అట్లయితే మరి రాతిరి గిట్లెందుకయిందిర'' అల్లీ సాహెబ్ ప్రశ్న. ఈయనకు వూల్లో పెద్ద కిరాణా కొట్టుంది.

''తమరికి తెల్వంది ఏముంది దొర, భస్మాసురున్ని ఎవరు కాల్చింద్రు? ఆనంతల ఆడే భస్మమైండు గద. గట్లనే ఈయన గూడ భస్మమయిండు. దానికి కొట్టంలోని పీర్లు సాచ్చం, ఆల్వాలోని అగ్ని సాచ్చం, మన చేతుల్లో ఏముంది?'' అంటూ చేతుల పైకెత్తి ఆకాశానికి ఓ సారి దండం పెట్టాడు.

''అరే నోరుమూయ్, మనుషుల సంగతి చెప్పమంటే దేవుండ్ల సంగతి చెప్పుతున్నావుర'' అమీన్ సాబ్ దబాయింపు. ముదుసలి ఈ సారి చుట్టు నిలుచున్న వాళ్ల వైపు చూస్తూ చేతులు జోడించి ''దొరలార ముందు పీర్లను బాయిల పడేసి పంచాయితి సూడుండ్రి. దినం గడిస్తే ఊరికి కీడు'' అని గుర్తు చేశాడు. అందరు ఆ సలహాకు తలలూపి, పోలీసులు పీర్లను బావిలో వేయడానికి ఓ పూట వ్యవధి నిచ్చారు. జనం అటు యిటు తిరుగుతున్నారు. డప్పుల చప్పుడు, కొమ్ముల మోతతో పీర్లు ఊరెమ్మటి బావివైపు ఊరేగింపుగా వెళుతువున్నాయి.

కాపు భార్య తన చెలుకలోకి వెళ్లి, తన భర్త గోరి ముందు తలవంచి నిలుచొని, తన భర్తను తలుచుకుని ఏడిచింది. రాత్రి తాను చేసిన ధైర్యం గుర్తొచ్చింది. ఊళ్లో మకాం వేసిన పోలీసులు గుర్తొచ్చి భయంతో కాళ్లు, చేతులు వనక సాగినయి.

కళ్లల్లో భర్త రూపం కదిలి, వంట్లో కొత్త శక్తి పుంజుకుంది. పంటచేలో

వాడు తన బతుకును నలిపివేసింది గుర్తుచేసుకుంది. వాన్ని నిప్పుల్లోకి తోయటం తప్పు కాదనిపించింది. తన భర్తను నరికి తలను కూడా చూడకుండా చేయటం కళ్లల్లో కదిలింది. ''ఆనాడు లేని పోలీసులు ఈనాడు ఏంసేస్తరు'' అనుకుంటు నడికట్టు బిగించి, భర్త గోరి మీద రెండు చేతులుంచి, చేతులవైపు చూసుకుంది. చేతులకున్న కొడవలందుకుంది. వెండి గోట్లు యిప్పుడు లేవు. మరొకసారి భర్తను తలుచుకుని, పిడికిలి బిగించి అక్కడినుండి కదిలి మంచెవైపు నడిచింది. మంచెమీదకెక్కి తన చెలకనంత చుట్టు చూసుకుంది. వంగి మంచె మీదున్న కొడవలందుకొని అడవివైపు నడిచింది. చీకటి పడేవరకు చీకటోల్లను చేరాలి అనుకుంది.

ఆమె నడకలో వేగం ఉంది.

ఆమె శ్వాసలో ఆవేశపు వేడి ఉంది.

ఆమె కదలికల్లో పోరాటపు పోకడలున్నాయి!

రొండిన వున్న కొడవలికి పదునూ ఉంది!

ఇక నిజాము తాబేదార్ల నీడలుండవు! జాడలుండవు!!

•1996